

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం

ఆసిఫాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. ఇటీవల ఈస్‌గాం పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించిన బషిరోద్దీన్ అనారోగ్యంతో మరణించగా మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన కుటుంబ సభ్యులకు కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా రూ. 2.20 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దయ్య, ఆర్ఐ(ఎంటీ) అంజన్న, జిల్లా పోలీసు కోఆపరేటివ్ సొసైటీ కో ఆర్డినేటర్ గఫరుద్దీన్ పాల్గొన్నారు.

పెండింగ్ వంతెనల నిర్మాణాలకు నిధులు కేటాయించాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. అసెంబ్లీలో మంగళవారం ఆమె మాట్లాడారు. ఆసిఫాబాద్ మండలంలో గుండి వంతెన నిర్మాణం రూ. 8.50 కోట్లతో మంజూరు చేసినప్పటికి కంట్రాక్టర్ నిర్మాణ పనులు చేపట్టడంలో జాప్యం వహించడంతో సంవత్సరాలు గడిచాయన్నారు. దీంతో వంతెన నిర్మాణ అంచనా వ్యయం రూ. 14.40 కోట్ల కు పెరిగిందన్నారు. మంత్రి సీతక్క గుండి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై వాగులో నుంచి నడుచుకుంటు వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ఇక్కడి కష్టాలు మంత్రి సీతక్క స్వయంగా చూశారన్నారు. వంతెన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేసి వర్షకాలంలోగా పూర్తి చేయాలని కోరంరు. కెరమెరి మండలం లక్మాపూర్ వంతెన అసంపూర్తిగా ఉందని నిధులు కేటాయించాలని కోరారు. వట్టివాగు ప్రాజెక్టు కాలువలు ఆధునీకరణకు నోచుకోక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలువలు నిర్మాణం కోసం రూ. 27.86 కోట్ల ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఊట్నూరు హస్నాపూర్ వరకు రోడ్డు అధ్వాన్నంగా మారిందని, నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలన్నారు. ఆరు కిలోమీటర్ల మేరలో ఉన్న కెర మెరి ఘాట్స్ రోడ్డు అధ్వాన్నంగా మారడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా యని చెప్పారు. రోడ్డు విస్తరణ కోసం అటవీ అనుమతులు అడ్డంకిగా మారాయని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని పనులు పూర్తి చేయాలని కోరారు.

సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య శ్రీ బకాయిల విడుదల చేయాలని కోరారు. 2012లో అప్పటి ప్రభుత్వం సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేసిందని, 317 జీవో వల్ల ఈ ప్రాంతంలోని ఎస్సైలకు 13 ఏళ్లుగా పదోన్నతి లేదని సభా దృష్టికి తీసుకవచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం



మరో రెండు రోజుల్లో (ఈ నెల 21) పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తమ పిల్లల భవిష్యత్తు ఈ పరీక్షలపై ఆధారపడి ఉందని అటు తల్లిదండ్రులు, ఇటు జిల్లాను ఫలితాల్లో ఉత్తమ స్థానంలో నిలుపాలని అధికారులు కోరుకుంటున్నారు.

- 21 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహణ
- హాజరుకానున్న 6,421 మంది విద్యార్థులు
- జిల్లాలో 36 కేంద్రాల ఏర్పాటు
- ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఛీఫ్ సూపరింటెండెంట్ అధికారుల నియామకం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యో తి): పదో తరగతి వార్షిక పరీక్షలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 6.421 మంది విద్యార్థులు పరీక్షలు రాయన్నారు. వీరిలో 2,894 మంది బాలురు ఉన్నారు. 3,527 మంది బాలికలు ఉన్నారు. వీరి కోసం మొత్తం 36 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు ప్రైవేటు పాఠశాల లు, రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 32 ప్రభుత్వ పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీరి కోసం మొత్తం 36 మంది సీఎస్, 36 మంది డీవో, రెండు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృం దాలు, పోలీసు స్టేషన్‌కు దూరంగా ఉన్న మూడు కేంద్రాలు మోడి, మహగాం, గంగాపూ ర్ గుర్తించి ప్రత్యేక కస్టోడియంలను ఏర్పాటు చేశారు. పరీక్షల నేపథ్యంలో ఇప్పటికే కలెక్టర్ వెంకటేష్ దోత్రే, డీఈవో యాదయ్య, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యేలా చర్య లు చేపట్టాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఎండ తీవ్రత అధి కంగా ఉంటు న్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

ఐదు నిమిషాల వరకు అనుమతి

పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు విద్యార్థులను అనుమతించనున్నారు. పదో తర గతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మొద టి నుంచి పరీక్ష సమయానికి ఐదు నిమిషాల వరకు కూడా అనుమతిస్తున్నాట్లు అధికారులు తెలిపారు. అధికారులు, విద్యార్థు లు ఎవరు కూడా పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకు రావద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు తనిఖీ చేసి పరీక్ష కేంద్రం లోకి అనుమతించనున్నారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు

ప్రతీ పరీక్ష కేంద్రంలో శుద్ధమైన తాగునీరు, విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసు కుంటున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటు న్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలు ఈనెల 21 నుంచి ఏప్రిల్ 2వ తేది వరకు జరుగుతాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించను న్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి వహాల్ టికెట్లను విడుదల చేసింది. తమ అధికార వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొవచ్చని ఎస్ఎస్‌సి బోర్డు తెలిపింది. మరోవైపు జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా ప్రతి పాఠశాలలకు ఇప్పటికే హాల్ టికెట్లను చేరవేశారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు..

- యాదయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి, ఆసిఫాబాద్



పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యా ర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏ ర్పాట్లు చేస్తున్నాం. కేంద్రాల్లో తాగునీరు, విద్యు త్ సౌకర్యం కల్పిస్తున్నాం. వైద్య సిబ్బంది తో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఈ ఏడాది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు చర్యలు తీసుకు న్నాం.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

సిర్పూరు(టి), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులు వెంటనే ప్రారం భించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం సిర్పూరు(టి) గ్రామ పంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ కట్టిన దరఖాస్తు దారులకు రశీదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై 20 శాతం రాయితీ కల్పిస్తూ ఈ నెల 31 తేదీ వరకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు 31 వరకు వంద శాతం పూర్తి చేసేట్టు అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే సిర్పూరు(టి) మండలంలోని మేడ్‌పల్లి గ్రామాల్లో మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాల పనులను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులు, అధికారులతో మాట్లాడుతూ ఇందిరమ్మ 31 మార్చిలోపు పునాది వరకు పనులు పూర్తి చేయాలన్నారు. ఈక్రమంలోనే రవణ్‌పల్లి గ్రామంలో మిషన్ భగీరథ సమస్యను వివరించారు. దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఈవో ఎస్ .తిరుపతి తదితరులు ఉన్నారు.

జమిలి ఎన్నికలే బీజేపీ లక్ష్యం



మాట్లాడుతున్న అరిగెల నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలే బీజేపీ లక్ష్యమని, ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదంతో పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వన్ నేషన్-వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలంతో కలిసి జిల్లాలోని 15 మండలాల కన్వీనర్ల, కో కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం ద్వారా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. పరిపాలన సామార్థ్యాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యంగా బీజేపీ ముందుకు వెళుతుందని చెప్పారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల నిర్వహణ కోసం కేబినేట్‌లో ఆమోదం తెలుపడంతో పాటు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశ పెట్టిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఒకే దేశం-ఒకే ఎన్నిక నినాదాన్ని తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సతీష్‌బాబు, మురళీ, రాజేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం తనిఖీ

సిర్పూరు(టి), మార్చి 18 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గిరిజన బాలికల వసతి గృహాన్నిమంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తనిఖీ చేశారు ఈ సందర్భంగా వసతి గృహంలో పారిశుధ్యం, విద్యార్థులకు మెనూ, మరుగుదొడ్లు, నిత్యవసర సరుకులు, పాలు గుడ్లు అందించే విషయంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలా ఉంటే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు.

కూలీలకు వసతులు కల్పించాలి

కాగజ్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మండలం ఆరెగూడ గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ సంఘం జిల్లా జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రోజు వారి కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండు చేశారు. అలాగే వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట నాయకులు అంగల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిని తరలించొద్దు

కాగజ్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిని తరలించకూడదని కార్మిక సంఘాల నాయకులు మంగళవారం ఈఎస్ఐ సూపరింటెండెంట్ డాక్టర్ జగన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భవనం మరమ్మతుల పేరుతో ఆసుపత్రి తరిస్తే ఊరుకునేది లేదన్నారు. 25 ఎకరాల్లో విశాలమైన భూ విస్తీర్ణంలో 62 పడకలతో వైద్యం అందించేందుకు సౌకర్యం ఉందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నూతన భవనం నిర్మించి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు కలికోట రమణయ్య, వెంకటేష్, రాజన్న, అంబాల ఓదెలు, రాగులయ్య, ఎకెసింగ్, సుభాష్, సునీల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

- చింతలమానేపల్లి (ఆంధ్రజ్యోతి): కాం గ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశా కార్యకర్తలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ జాఫర్‌కు వినతిపత్రం అందజేశారు.
- బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడిని అధిగమనిస్తేనే విజయం సాధ్యమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుందిళ్ల రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో మంగళవారం పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు.

- వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా మహిళా రైతులకు 50శాతం రాయితీపై ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు అందజేస్తోందని వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. స్థానికంగా మంగళవారం ఆయన మాట్లాడారు.

- ఆసిఫాబాద్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేదలకు సేవ చేయడమే ధ్యేమని వాసవిక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. యాపల్‌పట్టి గ్రామంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

- ఇటీవల కాగజ్‌నగర్‌లో నిర్వహించిన క రాటే పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను మంగళవారం పలువురు అభినందించారు. ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామంలోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు కాగజ్‌నగర్‌లో ఇటీవల నిర్వహించిన 6వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో రాణించారు.

- ఆసిఫాబాద్ (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీస వేతనం 18వేల రూపాయలు చెల్లిచాలని పలువురు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట 48 గంటల పాటు చేపట్టిన ధర్నా మంగళవారం రెండో రోజు కొనసాగింది.
- సిర్పూరు(టి), (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన 50 శాతం సబ్సిడీపై వ్యవసాయా యంత్రాల కోసం అర్హులైన మహిళా రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయా శాఖ అధికారి గిరీష్ సూచించారు.

బోరుబావులకు అనుమతి ఇవ్వాలి

ఆసిఫాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం పాపన్‌పేట, చింతలమానేపల్లి మండలంలోని గంగాపూర్, కొర్సిని, అంబగట్టు గ్రామాలలో తాగునీటి కోసం బోరు బావులు వేయకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని, ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం ఆయా గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావును కలిసి వినతి పత్రాలు అంద జేశారు. అనంతరం అయన విలేకరులతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని చెప్పారు. సమస్యపై అధికారు ల్లో చలనం లేదన్నారు. ప్రజలు తమ సొంత డబ్బులతో బోర్లు వేసుకునేందుకు యత్నించినా అటవీ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదన్నారు. బోరుబావులు వేసుకు నేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

వార, దినసంత వేలం వాయిదా

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట గ్రామపంచాయతీలో నిర్వహించే వార, దినసంత వేలంను వాయిదా వేశామని అధికారులు తెలిపారు. మంగళవారం వార, దినసంత, మేకల సంతల వేలం పాటను నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో వాయిదా వేశారు. మేకల సంతకు నిర్వహించిన వేలం పాటలో రవిచంద్రకాలనీకి చెందిన రాథోడ్ వినోద్ రూ. 17.85 లక్షలకు దక్కించుకున్నాడు. వార, దినసంత వేలం పాట తేదీని తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్పీవో ఉమర్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



భవనం పనులకు భూమి పూజ చేస్తున్న విశ్వప్రసాద్‌రావు

వాంకిడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్మాత్మిక మార్గంలో నడువాలని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. మండ లంలోని ఖమన గ్రామంలో మంగళవారం నిర్వహించిన పూలజీ బాబా ధ్యాన కేంద్రం నాల్గొవ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ధ్యానం చేయడంవల్ల ఆధ్యా త్మిక చింతనతో మానవళి జీవితానికి ప్రశాంతత లభిస్తుందనా ్నరు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, ధ్యాన మార్గం ఎంచుకొని సుఖమయమైన జీవితాన్ని పొందాలని సూచించారు. అనంతరం ధ్యాన కేంద్రం భవనం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అన్నాదానం చేశారు. కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు గుర్నులే నారా యణ, దుర్గం ప్రశాంత్, జాబిరె గణేష్, అనిల్, ధ్యాన కేంద్ర కమిటీ సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట గల చిల్డ్రన్‌పార్కులోని సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ భుజంగరావు అన్నారు. మంగళవారం పార్కును సందర్శించి వాకర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానన్నారు. చిన్న పిల్లలకు ఎంట్రీ ఫీజు కింద రూ. 10 తీసుకుంటున్నారని, పార్కులో కొన్ని చోట్ల ఉన్న ముళ్ల పొదలతో ఇబ్బందులకు గురవుతున్నామని చెప్పారు. ఉదయం వచ్చే వాకర్లకు ప్రతీ నెల చెల్లిస్తున్న రూ. 100 మినహాయింపు ఇవ్వాలని కోరారు. ముళ్ల పొదలు తొలగిస్తామని చెప్పారు. ఉదయం వచ్చే వాకర్లు రూ. 100 చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. పదేళ్ల దాటిన వారికి మాత్రం ఎంట్రీ ఫీజు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంల్లో అచ్యుత్‌రావు, శ్రీకాంత్, అమిత్‌ఖాన్, గణేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

రెబ్బెన, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకొని వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో యాదయ్య అన్నారు. రెబ్బెన జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వార్షిక పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలన్నారు. ఎలాంటి భయాలకు, ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో వార్షిక పరీక్షలు రాయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించా యి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లతీఫ్, మహేశ్వర్, మేడిచర ణ్‌దాస్, రాజనర్సుబాయి పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సఖి కేంద్రానికి వచ్చే బాధితులకు సత్వర సాయం అందించేలా నిర్వహకులు కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఇది వరకు నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సఖి కేంద్రం సిబ్బంది ఆమెను సన్మానిం చారు. కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, సఖి సిబ్బంది మమత, సుమలత, రమేష్, సత్యశీల తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం 400 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, వాటర్ బాటిళ్ల అందజేశారు. కార్యక్రమంలో సీఐ రవిందర్, ఎంఈవో రాథోడ్ సుభాష్, హెచ్ఎం సుభాష్, ఉపాధ్యాయులు హేమంత్ షిండే, రమేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

ఆసిఫాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు ఓటరు జాబితా రూప కల్పనకు సహకరించాలని ఆర్డీవో లోకేశ్వర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించారు. అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్లు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

● పల్లెల్లో కంపుకొడుతున్న వీధులు ● రోడ్లపైనే మురుగునీరు ● పట్టించుకోని అధికారులు



ఎల్కపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బెజ్జూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పారిశుధ్యం లోపించి అస్తవ్యస్తంగా మారాయి. వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చెత్త పేరుకుపోయి, డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో వ్యాధుల భయంతో ప్రజలు వణికిపోతున్నారు. బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మురికి కాలువల్లో పూడిక పూర్తిగా నిండిపోయింది. దీంతో మురుగునీరు రోడ్లపైనే పారుతోంది. నీరంతా రోడ్లపై ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఏ గ్రామంలో చూసిన పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. రోడ్ల పైనే మురుగు చెత్తాచెదారం పేరుకు పోతున్నాయి. పచ్చదనం-స్వచ్ఛదనం తూతూ మంత్రంగా తయారైంది. కనీస సౌకర్యాలు లేక ఆయా గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన వచ్చి ఏడాది దాటినా సమస్యలు పరిష్కారానికి నోచుకో వడంలేదు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే నెలకొన్నాయి. డ్రైనేజీల్లో పూడిక తొలగించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో మురికి నీరంతా రోడ్లపై ప్రవహించడంతో వీధులన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. దోమలు కూడా విపరీతంగా పెరిగిపోవడంతో జ్వరాల బారిన పడుతున్నామని చెబుతున్నారు.

సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో..

సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ఏడాది కాలంగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ప్రత్యేకాధికారులు గ్రామాలకు అడపాదడపా వచ్చి పోతుతుండడంతో సమస్యలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ప్రజలు పారిశుధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాలువలు శుభ్రం చేయక పోవడం, వీధుల్లో మురుగు నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. వీధుల్లో చిన్న గుంత ఏర్పడిన పూడ్చేవారే కరువయ్యారు. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతోంది. గ్రామపంచాయతీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు ఎప్పుడో ఒకసారి వెళుతుంటే తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకాధికారులు కేవలం సంతకాలకే పరిమితమైనట్లుగా వస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నుంచి సరైన విధంగా నిధులు మంజూరు కాక పోవడంతో కార్యదర్శులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన తొలగించని చెత్త

గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నాం

విజయలక్ష్మి, సీడీపీవో



ఆంధ్రజ్యోతి: గర్భిణులకు పోషకాహారం అందించేందుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

సీడీపీవో: గర్భిణులకు పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఐసీడీఎస్ పరిధిలో 1,960 మంది గర్భిణులు ఉన్నారు. వారికి ప్రతి రోజూ ఒక్క పూట భోజనం, పాలు, గుడ్లు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సిర్పూర్(టి) ఐసీడీఎస్ పరిధిలో ఎన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి?

సీడీపీవో: సిర్పూర్(టి) ఐసీడీఎస్ పరిధిలో ఐదు మండలాలకు గాను మొత్తం 202 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 12,292 మంది చదువుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఎన్ని కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయి?

సీడీపీవో: ఐసీడీఎస్ పరిధిలో 32 పక్కా భవనాలు ఉన్నాయి. 50 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద ఐదు నూతన భవనాలు మంజూరు అయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

ఆంధ్రజ్యోతి: పలు సెంటర్లలో సిబ్బంది సమయపాలన పాటించడంలేని చెబుతున్నారు.?

సీడీపీవో: సిబ్బంది సమయపాలన పాటించేలా సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో తనిఖీలు చేస్తున్నాం. నిర్లక్ష్యం వహించే వారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయి.

- సిర్పూర్(టి), ఆంధ్రజ్యోతి

ఎల్ఆర్ఎస్ రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని బూర్గుడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డీఎల్‌పీవో ఉమర్‌తో కలిసి పంచాయతీ పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు చేసుకొని క్రమబద్ధీకర కోసం ఎదురు చూస్తున్న వారికి ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నూతన ఇంటి నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తప్పని సరిగా ఎల్ఆర్ఎస్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల బ్యాంకు రుణ సౌకర్యం పొందవచ్చన్నారు. ఈనెల 31లోగా రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి మొక్కల నిర్వహణను పరిశీలించారు. మొక్కల పెంపకంలో అలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. నర్సరీలో నాటిన విత్తనాలు మొలకెత్తక పోవడంపై రెండు రోజుల్లో నివేదిక అందిచాలని ఏపీఎంను ఆదేశించారు. మొక్కలు నాటేందుకు మరో రెండు నెలల గడువు ఉన్నందున నర్సరీలో విత్తనాలు త్వరగా మొలకెత్తె విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మౌనిక, ఏపీఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

గుస్సాడీకి గిన్నిస్‌బుక్‌లో చోటు అభినందనీయం

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజన సంప్రదాయమైన నృత్యమైన గుస్సాడీకి గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించడం అభినందనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యంలో తిర్యాణి మండలం దంతన్‌పెల్లి గ్రామానికి చెందిన భీమయ్య కొలాం గుస్సాడి బృందానికి ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ డేవిడ్‌లతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గణతంత్ర దినోత్సవంగా సిందర్భంగా ఢిల్లీలో ఐదువేల మందితో నిర్వహించిన కార్యక్రమంలో గుస్సాడీ ప్రదర్శన ద్వారా జిల్లా కళాకారులు ఆకట్టుకునే ప్రదర్శన చేశారని చెప్పారు. దంతన్‌పెల్లి పీవీటీజీ కొలాం గుస్సాడీ బృందం అందించిన ప్రదర్శన గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానాన్ని సంపాందించడం గర్వంగా ఉందన్నారు. సంస్కృతి సంప్రదాయలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. అనంతరం గుస్సాడీ బృంద సభ్యులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి రమదేవి, జీసీడీవో శకుంతల, గిరిజన సంఘాల నాయకులు అర్జు, గంగరాం, భీంరావు, సంతోష్, దస్రు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

● అత్తింటి వేధింపులే కారణం అంటూ సెల్ఫీ వీడియో



అంజన్న(ఫైల్)

దండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం వెల్గనూర్ గ్రామానికి చెందిన కాంద్రపు అంజయ్య(25) అనే యువకుడు సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంజయ్య చనిపోయే ముందు తన చావుకు కారణం అత్తింటి వాళ్లు అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని సోషల్ మీడియాలో పోస్టు చేసాడు. వివరాల్లోకి వెళితే అంజయ్య ఇదే మండల కాసిపేట గ్రామానికి చెందిన శిరీష ఇద్దరు ప్రేమించుకున్నారు. రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకోగా వారం రోజు క్రితం పాప జన్మించింది. బిడ్డను చూసేందుకు అత్తగారింటికి వెళితే అక్కడ గొడవ జరిగిందని రాత్రి ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు చెప్పుకుని గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన చావుకు భార్య శిరీషతోపాటు అత్తమామ మాదాసు స్వరూప, మాదాసు శివన్నతో పాటు మాదాసు సంధ్య, అశెట్టి రమణ, గంగారెడ్డి, కళ్లెం రాము, కొడిమ్యాల సురేష్ కారణం అని సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. మృతుని తండ్రి బీమయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై తహసీయొద్దీన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చోరీ కేసులో మూడు నెలలు జైలుశిక్ష

లక్సెట్టిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో లక్సెట్టిపేట న్యాయస్థానం మహారాష్ట్రకు చెందిన గంగాధర్ విట్టల్ గైక్వాడ్ అనే నిందితుడికి 3నెలల 9రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు గత ఏడాది అక్టోబర్‌లో అంద్రబోర్ సమీపంలో తాలం వేసి ఉన్న రెండు ఇండ్ల తాళాలు పగులగొట్టి 50వేల రూపాయల నగదుతో పాటు 5వేల రూపాయల ఇత్తడి సామగ్రిని దొంగతనం చేశాడు. నరెండ్ల లక్ష్మి అనే బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై-2రామయ్య కేసు నమోదు చేసుకుని దొంగను కోర్టులో హాజరు పర్చడంతో జూనియర్ సివిల్ జడ్జ్ మహ్మద్ అసదుల్లా షరీఫ్ శిక్ష ఖరారు చేసారు. దొంగతనం కేసును ఛేదించి దొంగకు శిక్ష పడేట్లు చేసిన ఎస్సై-2రామయ్యతో పాటు కోర్టు పీసీ వేణును లక్సెట్టిపేట ఎస్సై సతీష్, సీఐ నరేందర్‌తో పాటు ఉన్నతాధికారులు అభినందించారు.

బెట్టింగ్ యాప్‌లు ప్రమాదకరం



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లు ప్రమాదకరమని, యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోసపూరిత ప్రకటనలు, సందేశాలు, నమ్మి వివరాలు పంపకూడదన్నారు. చాలా మంది సందేశాలు చూసి మోసపోతున్నారన్నారు. అవగాహనలేక అత్యాశకుపోయి ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టడంవల్ల ప్రజలు మోసాల బారిన పడుతున్నారని చెప్పారు. బెట్టింగ్ యాప్‌లు చాలా ప్రమాదకరమన్నారు. ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు యువత అప్ర మత్తంగా ఉండి 100కు డయల్ చేయాలని చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేటలో ఈనెల 16వ తేదీన జరిగిన చోరీ కేసును 24గంటల లోపే పోలీసులు ఛేదించారు. నిందితురాలిని పట్టుకుని సొత్తు రికవరీ చేయడంతో పాటు రిమాండ్‌కు తరలించిటన్లు ఎస్సై సతీష్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సీఐ నరేందర్ వివరాలు వెల్లడించారు. స్థానిక గోదావరి రోడ్డులో కొత్త శ్యామల అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఇది గమనించిన ఎదురు ఇంట్లో నివాసం ఉండే సముద్రాల వసంత అనే మహిళ శ్యామల మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడుపై కన్నేసింది. ఆదివారం శ్యామల ఒంటరిగా ఉండడం గమనించి ఇంట్లోకి చొరబడి ఆమె కంట్లో కారం చల్లి మెడలో ఉన్న మూడు తులాల పుస్తెల తాడు లాక్కొని బాధితురాలిని బాత్‌రూంలోని నెట్టేసి గడియ పెట్టి అక్కడి నుంచి పారిపోయింది. శ్యామల అరుపులు విన్న స్థానికులు వచ్చి గడియ తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నరేందర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు అదే రోజు సాయంత్రం దాడి చేసింది సముద్రాల వసంత అని గుర్తించారు. ఈ మేరకు వసంతను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితురాలు నేరం అంగీ కరించడంతో బంగారం రికవరీ చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన ఎస్సై సతీష్‌తో పాటు కానిస్టేబుళ్లు అంజిబాబు, తిరుపతి, ప్రవళిక, మనీష, బ్లూకోల్ట్ పోలీసులను సీఐ అభినందించారు.

యువకుడి ఆత్మహత్య

జైపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివ్వారం గ్రామానికి చెందిన గెల్లు రాకేష్ (25) అనే యువకుడు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జైపూర్ అదనపు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం పొలానికి మందు కొట్టే విషయంలో రాకేష్ తల్లితో గొడవ పడ్డాడు. దీంతో ఆగ్రహానికి గురై తల్లి పోచక్కను రాకేష్ కొట్టాడు. విషయం తెలిసి తండ్రి సమ్మయ్య కుమారుడిని మందలిం చడంతో మనస్తాపం చెందిన రాకేష్ తన పొలం సమీపంలోని మంగలి గుట్ట అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం నుంచి కుమారుడు ఇంటికి రాక పోవడం, సెల్‌ఫోన్ స్విచాఫ్ ఉండడంతో పొలం సమీపంలోని అటవీ ప్రాంతంలో వెతకగా చెట్టుకు ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులు భయం వీడాలి

జైనూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలు భయం లేకండా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని గ్రామ పటేల్ గంగాధర్, ప్రధానోపాధ్యాయురాలు అరుణ అన్నారు. పట్నాపూర్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల(బాలికల)లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహిచారు.



అవసరం మేరకు బొగ్గు ఉత్పత్తి చేయాలి

శ్రీరాంపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలకు అవసరమైన బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి అనుగుణంగా వెలికితీయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. ఏరియాల జీఎంలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తెలంగాణ తో పాటు దేశంలోని రాష్ట్రాలలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. సింగరేణితో ఒప్పందం ఉన్న అన్ని కంపెనీలకు రోజుకు 50 రేకుల బొగ్గున సరఫరా చేయాలన్నారు. ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను ముందే చేరుకున్న కిష్టారం, పీకే-4, జీడీకే-5, ఆర్జీ-2, శ్రీరాంపూర్-2 ఓసీపీలు, ఆర్కే-6 ఇంక్లైన్, ఆర్కే న్యూటెక్ ఇంక్లైన్ గనుల అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు సత్యానారాయణ రావు, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఈడీ(కోల్ మూమెంట్) సుభాని, జీఎం(సీపీపీ) మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు అన్ని వసతులు కల్పిస్తాం

శ్రీరాంపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేసే మహిళా ఉద్యోగులకు అన్ని వసతులు కల్పిస్తామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే-8 డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మా ట్లాడారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, మీడియా ఇన్‌చార్జి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్ చిట్టీలు అందించాలి

శ్రీరాంపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కోరారు. ఈ మేరకు అయన మంగళవారం గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచౌరీకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి మొగిలి, కలవేని స్వామి, నస్పూర్ బాపు, నీరటి సురేష్, సత్యనారాయణ, నరేష్, రాజగోపాల్, సమ్మయ్య, రవి పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనే లక్ష్యం

కాసిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల సాధనే లక్ష్యమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. కాసిపేట 1వ గనిలో మంగళవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సత్తుపల్లి, ఇల్లెందు టెండర్లలో సింగరేణిలో పాల్గొనవద్దని చెప్పిందని, కానీ వీటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడి టెండర్లును రద్దు చేయించాలని కోరారు. అలాగే ఇటీవల జరిగిన స్ట్రక్చర్‌సమావేశంలో విజిలెన్స్, మారుపేరు కేసులు, 40 సంవత్సరాలు ఉన్న కార్మికులకు సర్టిఫికెట్‌లలో తప్పులు దొర్లాయని నిలిపివేసిన కేసులను వెంటనే పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరామని చెప్పారు. ఇందుకు యాజమాన్యం సానుకూలంగా స్పందించిం దన్నారు. ఇన్‌కంటాక్స్, సొంతింటి పథకంకు కమిటీలను వేశారని అన్నారు. డిస్మిస్ అయిన కార్మికులకు ఐదేళ్లలో ఒక్క సంవత్స రంలో వంద మస్టర్లు నిండిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు యాజమాన్యం సూత్రప్రాయంగా అంగీకరించిందని చెప్పారు. 11 రకాల అలవెన్స్‌లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపిందన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి, హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ముందుండి పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, చిప్ప నర్సయ్య , దాగం మల్లేష్, వెంకటస్వామి, నాగేశ్వర్‌రావు, శ్రీహరి, రాజేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య, పాల్గొన్న కార్మిక సంఘం నాయకులు

లాంగ్‌వాల్ ప్రాజెక్టు రద్దు చేయించాలి



ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

బెల్లంపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శాంతిఖనిగని లాంగ్‌వాల్ ప్రాజెక్టును రద్దు చేయించాలని నిర్వాసిత గ్రామాల ప్రజలు మంగళవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టు వల్ల ఎంతో మంది గ్రామస్తుల రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని రద్దు చేయించేందుకు సింగరేణిపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. లాంగ్‌వాల్ ప్రాజెక్టు వల్ల సాగునీరు, తాగునీరు పర్యావరణ సమస్యలు ఏర్పడతాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైతుల, ప్రజల భవిష్యత్ మనుగడ కోసం శాంతిఖనిగని లాంగ్‌వాల్ ప్రాజెక్టును శాశ్వతంగా రద్దు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్థానికంగా స్పందించారని గ్రామస్థులు తెలిపారు కార్యక్రమంలో ప్రభావిత గ్రామాల రైతులు, ప్రజలు సత్యానారాయణ, అశోక్‌గౌడ్, రవి, గొమాస వినోద్, నరేందర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యువ ఉద్యోగులపైనే సింగరేణి భవిష్యత్తు

మందమర్రిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరుతున్న యువ ఉద్యోగులపైనే సింగరేణి భవిష్యత్ ఆధారపడి ఉందని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. జీఎం కార్యాలయంలో మంగళవారం మెడికల్ ఇన్‌వాలిడేషన్ కింద కాన్ఫరెన్స్ హాల్‌లో కారుణ్య నియామకం కింద 40 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు చేయూత

మందమర్రిటౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కార్మికుల పిల్లల ఉన్నత చదువులకు యాజమాన్యం చేయూతనం దిస్తుందని జీఎం దేవేందర్ తెలిపారు. మంగళవారం జీఎం కార్యాలయంలో కేకే ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నూనె సాంబయ్య కుమార్తె నూనె పావణి ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్నందున ఆమెకు మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందిం చారు. అలాగే మరో కూతురు సజనని కి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కర్ణాటకలో రెండవ సంవత్సరం చదువుతున్నందున రూ. 10 వేల మెరిట్ స్కాలర్‌సిప్ అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచీ సెక్రటరీ సత్యనారాయణ, అధికారులసంఘం అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బెల్లంపల్లి: సామాజిక సేవా కార్యక్రమంలో చేపట్టడంలో వాసవిక్లబ్ ముందంజలో నిలుస్తుందని, క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రామకృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు వాటర్ ట్యాంక్, ఇతర వస్తువుల పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం అమ్మ అనాథ శరణాలయానికి రెండు సీలింగ్ ఫ్యాన్‌లను అందజేశారు. వాసవి క్లబ్ గవర్నర్ కిషోర్, సభ్యులు పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీయన్ జిల్లా 107 కార్పొరేట్ వైస్ ఛైర్మన్ గోల్డెన్ స్టార్ సంతోష్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ ప్రారంభించారు. కొమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని నర్సాపూర్ గిరిజన గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం, నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. మాదారం ఎస్‌ఐ సౌజన్య, పంచాయతీ కార్యదర్శి జగదీష్, కంటి వైద్యులు అంజయ్య, ల్యాబ్ టెక్నిషియన్ సంతోష్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్ పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని జగ్గయ్య పేట వడాల గ్రామాల మధ్యలో ఆర్‌అండ్‌బీ రహదారిపై మంగళవారం జేసీబీ ఢీకొని విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ సరఫరా లేక పోవడంతో ప్రమాదం తప్పింది.


చెన్నూరు : యువత ఎలాంటి చెడు అలవాట్లకు లోను కాకుండా సన్మార్గంలో నడవాలని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్వర్ధన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపల్ కిశోర్‌కుమా ర్, ఎన్‌ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి సర్వర్ పాషా పాల్గొన్నారు.

కాసిపేట : బెల్లంపల్లికి చెందిన పులి సౌజన్య పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం కాసిపేట ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అందజేశారు. సౌజన్యం సోమగూడెంలో ఫోన్ పోగొట్టుకోగా కాసిపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి అందజేశారు.

జన్నారం : ఈ నెల 20న రేండ్లగూడ గ్రామంలో వారసంత వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ వేల పాటలో పాల్గొనే వారు ముందుగా రూ. 30 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

●తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి జిల్లా ఉపాధ్యక్షులుగా జన్నారానికి చెందిన ఆరే సత్యం నియమితులయ్యారు. ఆయనను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య ఉత్తర్వులు జారీ చేశారు.

భీమారం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పీఎం శ్రీ పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, యశోదర, రాజ్‌లు అతిథిలుగా హాజరై మాట్లాడారు. అనంతరం ఇదే పాఠశాలలో పని చేసి పదవీ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌ను సన్మానించారు.



కళ తప్పిన పర్యాటక ప్రాంతం

జోడు వాగుతో అనేక లాభాలు..

భీమారం మండలం వ్యవసాయానికి అత్యంత ప్రధానమైన వనరు. మండలానికే తలమానికమైన గొల్ల వాగు ప్రాజెక్టు ఈ జోడు వాగు మీదనే నిర్మించారు. దీంతో భీమారం మండలంతో పాటు చెన్నూరు మండలంలో సైతం అనేక బీడు భూములు నేడు వ్యవసాయ భూములుగా మారాయి. జోడు వాగుకు ఇరువైపులా పంట పొలాలు, బోరు బావులు వేసుకోని పంట పొలాలకు, మామిడి తోటలకు, కొబ్బరి తోటలకు, పామ్ ఆయిల్ తోటలకు ఈ జోడు వాగు నీరే ప్రధాన ఆధారం..

- నాడు గల గల...నేడు వెల వెల
- జోడు వాగు ప్రాంతంపై కరువైన పట్టింపు..
- పర్యవేక్షణ లేక ఆదరణ కోల్పోతున్నవైనం

భీమారం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రం సమీపంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జోడువాగు ప్రాంతం కళ తప్పింది. మండలంలోని ప్రధాన వాగుల్లో అత్యంత ప్రాముఖ్యమైంది జోడువాగు. ఈ వాగు భీమారం మండలం కాజీపల్లి గ్రామం వద్ద గొల్లవాగుగా నామకరణంతో నర్సింగాపూర్ వద్ద మరో పెద్దవాగును కలుపుకుని భీమారం, పోతనపల్లి మధ్య గల ఆరెకుల వాగుతో మిళితమైంది. భీమారంలోని చెలిమల వాగుతో కలిసిపోయింది. ఇలా అనేక వాగుల మిళితమే చెన్నూరు - భీమారం మధ్య గల జోడు వాగు. ఈ వాగు ఇక్కడితోనే ఆగకుండా చెన్నూరు మండలంలోని సుద్దాల వద్ద గల రాముని పాదాలను తడిపి, కత్తెరసాల మల్లన్న దీవెన పొంది ఉత్తర వాహిని గోదావరిలో అంతర్భాగమవుతుంది.

నిజాం హయాంలో బ్రిడ్జి నిర్మాణం..

మంచిర్యాల నుంచి భీమారం మీదుగా చెన్నూరు వెళ్లాలంటే జోడు వాగులు దాటి ప్రయాణించాలి. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నాటి నిజాం ప్రభుత్వ హయాంలో ఇక్కడ పెద్ద పెద్ద శిలల లాంటి బండలతో డాంగ్ సున్నంతో మిళితం చేసి బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి నిర్మించి సుమారు వంద సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండడం గమనార్హం. 25 ఏళ్ల క్రితం ఆదిలాబాద్ జిల్లాతో పాటు కొమురంభీంఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలో పర్యటక కేంద్రంగా ఉండగా ప్రజలు, విద్యార్థులు జోడు వాగు ప్రాంతాన్ని సందర్శించేవారు. అలాగే ఇక్కడ అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వనం సైతం ఉండేది. ఈ కార్తీక వనంలో మొక్కలను పెంచుతూ ఉమ్మడి జిల్లాకు సరఫరా చేసేవారు. ఇదే ప్రాంతంలో బొటానికల్ టూర్‌గా విద్యార్థులు మొక్కలను పరీక్షించేందుకు వచ్చేవారు. ఇందులో ఫారెస్టు మొక్కలతో పాటు నాన్ ఫారెస్టు గార్డెన్ మొక్కలను సైతం పెంచడంతో అందర్ని ఆకట్టుకునేవి.



పాడైపోయిన పర్యాటకులు సేద తీరేందుకు ఏర్పాటు చేసిన కుర్చీలు

దగ్గరలో అంబేద్కర్ టూరిజం పార్కు

జోడు వాగు ప్రాంతం నాడు అత్యంత పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతున్న క్రమంలో నాటి ప్రభుత్వం దీనికి అత్యంత సమీపంలో వాగును ఆనుకుని సుమారు 200 మీటర్లదూరంలో పెద్ద ఎత్తున అంబేద్కర్ టూరిజం పార్కును బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పార్కులోకి వెళ్లాలంటే టికెట్ తీసుకుని వెళ్లాల్సిందే. ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు సైతం ఇక్కడకు పిక్నిక్‌ల కోసం వస్తుంటారు.

నాడు గల గల నేడు వెల వెల

నిత్యం ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పర్యాటకుల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం నేడు వెల వెల బోతోంది. నాడు విద్యార్థులు, పర్యాటకులు ఆడుకునేందుకు జారుడు బండలు, సేద తీరేందుకు తివాచీలు, బరువును చూసుకునేందుకు యంత్రాలు ఉండేవి. అంతేకాకుండా వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర ఆటలు ఇక్కడ ఆడేవారు. కానీ ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండి ఈ ప్రాంతం వెల వెలబోతోంది. అలాగే ఇక్కడకు వచ్చే పర్యాటకుల కోసం ఉచితంగా ఫారెస్టు అధికారులు జోడు వాగు నుంచి బోర్లు వేసి పర్యాటకులకు మంచినీరు అందించేవారు. ప్రస్తుతం జోడు వాగు వెల వెలబోతుండడంతో పర్యాటకులు నాటి వైభవం లేదని వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు జోడు వాగు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం
రత్నాకర్, మంచిర్యాల ఎఫ్ఆర్‌వో



జోడు వాగు ప్రాంతం వద్ద గతంలో పర్యాటక కేంద్రం ఉన్న స్థలంలో పునరుద్ధరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం. రానున్న రోజుల్లో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తాం. ఇప్పటికే అటవీ శాఖ ఆధ్వర్యంలో అనేక రకాల మొక్కలను పెంచుతున్నాం. నర్సరీలను అభివృద్ధి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే కళ తప్పిన పర్యాటక కేంద్రాన్ని పున రుద్ధరించేందుకు కృషి చేస్తాం.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు

●పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
●కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రి టౌన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): గృహాలు లేని నిరుపేదల గృహ వసతి కోసమే డబుల్ బెడ్‌రూం గృహాల నిర్మాణం చేపట్టామని, అర్హులకే వాటిని అందజేస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూం గృహాలను సందర్శించి వాటిని పరిశీలించారు. అనంతరం ఇటీవల ఎంపిక చేసిన 240 మంది గృహ లబ్ధిదారులకు పలువురికి గృహ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంకా ఎవరికైన అనుమానాలు ఉంటే తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయవ చ్చునని తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ పాల్గొన్నారు. లబ్దిదారులు వారి వారి నివాసాలకు తాళాలు వేసుకున్నారు.

●పట్టణంలోని ఐటీఐ ప్రాంగణంలో ఇటీవల నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను పరిశీలించారు. పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సెంటర్‌లో ఆయా కోర్సులు పూర్తి చేసుకున్నవారికి ఆయ పరిశ్రమల నిర్వాహకులు నేరుగా ఎంపిక చేసుకొని ఉద్యోగాలు ఇస్తారని తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పాఠశాలను సందర్శించారు. అక్కడి నుంచి నేరుగా ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు.

●పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ రాజలింగును పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు.



ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిరూరల్ : మండలంలోని గ్రామాల్లో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. సారంగపల్లిలోని నర్సరీని పరిశీలించి మొక్కలను సంరక్షించాలని సూచించారు. అనంతరం ఆదిల్‌పేట, పొన్నారంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

పాఠశాల వార్షికోత్సవంలో
డీఈవో యాదయ్య

నస్పూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు అలుపెరగకుండా శ్రమించాలని డీఈవో యాదయ్య అన్నారు. నస్పూర్ పట్టణంలోని తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలలో చదువు, ఆటపాటల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సైన్స్ ల్యాబ్‌ను డీఈవో పరిశీలించారు. స్కూల్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తూ ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దినందుకు ఉపాధ్యాయులను, విద్యార్థులను డీఈవో అభినందించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యాదయ్య మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు మనల్ని పరీక్షించడానికి కాదని, పదేళ్లలో మనం నేర్చుకున్న దానిని తెలుసుకోవడానికి మాత్రమేనన్నారు. విద్యార్థులు ఏలాంటి ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు చౌదరి శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, రాజ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామన్న, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో డీఈవోకు పూల మొక్కను అందిస్తున్న విద్యార్థులు

దాడికి పాల్పడ్డ వారిపై కేసు నమోదు

మంచిర్యాల క్రైం, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఏసీసీకి చెందిన శ్రీరాముల శ్రీనివాస్, భార్య మౌనికలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఒడ్డెర కాలనీకి చెందిన కొత్త గట్టు పద్మ భర్త శ్రీనివాస్‌కు, శ్రీరాముల శ్రీనివాస్‌కు కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. వీరిద్దరికి పొత్తులో ఒక ఇళ్లు ఉంది. శ్రీరాముల శ్రీనివాస్‌కు ప్రహరి గోడ నిర్మిస్తానని చెప్పి గోడ నిర్మించింది. దానికైన ఖర్చు రూపాయలు ఇవ్వమని అడుగగా శ్రీనివాస్ భార్య మౌనిక పద్మను దుర్భాషలాడింది. దీంతో శ్రీరాములు శ్రీనివాస్ కొత్తగట్టు పద్మ భర్త శ్రీనివాస్‌పై దాడి చేశారు. పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరాముల శ్రీనివాస్, మౌనికపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత పోరాటంతోనే బీసీల బిల్లు

బెల్లంపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగానే అసెంబ్లీలో బీసీల బిల్లు ప్రవేశపెట్టాలని జాగృతి నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీల బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మెల్సీ కవిత చేసిన ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గిందని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్ కోసం విద్య, ఉపాధి రాజకీయ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం రెండు వేర్వేరు బిల్లులను ప్రవేశ పెట్టడం స్వాగతిస్తున్నామన్నారు. జాగృతి నాయకులు రాకేశ్, మౌనిక్, సాయి క్రిష్ణ, శ్రీనాథ్, పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ బాధ్యత అందరిది

మందమర్రిరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అడవిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిదని ఆవడం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ రేవతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పొన్నారం గ్రామంలోని ఉపాధి హామీ పని ప్రదేశం వద్ద అటవీ నిప్పు మానవాళికి ముప్పు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం గౌరవ జిల్లా అధ్యక్షుడు ఈద లింగయ్య పాల్గొన్నారు.

ఏళ్ల నాటి చెట్టు నరికివేత

కోటపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆ రావి చెట్టు వందల ఏండ్ల కాలం నాటిది...ఆ గ్రామస్తులకు అదే బస్టాండ్..గ్రామస్తులంతా ఏ సమావేశం నిర్వహించుకోవాలన్నా ఈ చెట్టుకిందే. వచ్చి పోయే వారితో సందడి ఉంటూ నీడనిచ్చే ఈ చెట్టు మంగళవారం నరికివేతకు గురైంది. గ్రామస్తులు ఈ చెట్టును బస్టాప్‌గా పరిగణిస్తుండగా బస్సులు, ఇతర వాహనాలు ఇక్కడే ఆగేవి. నిత్యం పచ్చగా ఉంటూ వాహనదారులకు చల్లని నీడనిచ్చేది. అలాంటి చెట్టును పక్కనే ఉన్న భూమి యాజమాని నరికివేశాడని గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్

దండేపల్లి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ సూచించారు. పిఎంశ్రీ దండేపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలోని జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఈనెల21న జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారి రాజుకుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శోభ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ అల్లం అనిత, మాజీ పాఠశాల ప్రదానోపాధ్యాయుడు బీసగోని శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుబాబు అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు రాజేశ్వర్, వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాసిపేట : మండలంలోని కాసిపేట,ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలల్లో మంగళవారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమానికి ఎంఈవో వెంకటేశ్వరస్వామి హాజరై మాట్లాడారు. అనంతరం పరీక్ష సామాగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు సాంబమూర్తి, శాంకరి పాల్గొన్నారు.

నెన్నెల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఘనంగా విడ్కోలు పలికారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు ఆట పాటలతో హుషారుగా గడిపారు. పదేళ్ల పాటు కలిసి చదివిన బడిని, క్లాస్‌మెట్లను వీడి పోవడం బాధగా ఉందన్నారు. సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భానుడి భగభగ..

(5వ పేజీ తరువాయి)

హాజరుశాతంపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎండ వేడిమి కారణంగా విధులు నిర్వహించేందుకు కార్మికులు ఆసక్తి చూపే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. కార్మికుల అవస్థలు దృష్టిలో పెట్టుకొని సింగరేణి ఉన్నతాధికారులు షిఫ్టుల వేళల్లో మార్పులు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు.

●విద్యార్థులకూ ఇబ్బందులు...

కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఎండల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున మధ్యాహ్నం ఇంటికి వెళ్లే క్రమంలో ఎండ నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే పాఠశాలలకు ఒంటి పూట ప్రకటించినప్పటికీ మధ్యాహ్నం సమయంలో ఎండ వేడికి గురవుతున్నారు. ఇండ్లలోను ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లలో వేడి గాలులు వస్తుండడంతో అవస్థలు తప్పడం లేదు.

●వారం రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా...

గడిచిన వారం రోజుల్లో జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 12న నెన్నెల మండలంలో 40.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా 13న కాసిపేట మండలం కొండా పూర్‌లో 40.7 డిగ్రీలు, 15న జిల్లా కేంద్రంలో 40.2 డిగ్రీలు, 16న భీమారం మండలంలో 41.0 డిగ్రీలు, 17న చెన్నూర్ మండలం కొమ్మెరలో 41.3డిగ్రీలు, 18న బెల్లంపల్లిలో 41.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

బెల్లంపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో సిబ్బందితో కలిసి ఇంటి పన్నుల స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. వందశాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఏడాది మార్చిలోగా పూర్తి లక్ష్యాన్ని చేరుకునేలా పటిష్ట కార్యచరణ అమలు చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు సంపూర్ణ న్యాయం



మాట్లాడుతున్న బీసీ జేఏసీ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ తోనే బీసీలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని, తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం హర్షణీయమని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీకి, రాహుల్‌గాంధీకి, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నాయకులు నీలకంటేశ్వర్‌రావు, రాజ్‌ఖిరణ్, శ్రీనివాస్, మహేష్‌వర్మ, రాజన్న యాదవ్, రవీందర్, చంద్రకాంత్, లతీఫ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన మెటీరియల్, కంపోనెంట్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రూ. 43 కోట్ల వ్యయంతో మెటీరియల్, కంపోనెంట్ అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, ఇప్పటి వరకు రూ. 22 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. జిల్లాలో 2050 పనులు మంజూరు కాగా ఇప్పటి వరకు 1617 పనులు పూర్తయ్యాయని తెలిపారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం అందజేత

బెల్లంపల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పెరికపల్లి గ్రామానికి చెందిన సరిత వైద్యం కోసం మంగళవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు 27వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సేవా సంస్థ అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ సరిత కొన్ని రోజులుగా మెదడు వాపు వ్యాధితో బాధపడుతుందని, ఆసుపత్రి చికిత్స కోసం డబ్బులు లేవనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. విషయం తెలిసిన వెంటనే దాతల సహాయంతో 27వేల రూపాయల విరాళాలు సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. సభ్యులు కాంపెల్లి విజయ్‌కుమార్, గిరి ప్రసాద్, బాలాజీ, నాగేశ్‌గౌడ్, రాజన్న పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి

కోటపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదివాసీ గ్రామాల్లోని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ గ్రామాల్లో నెల కొన్న సమస్యలపై సర్వే నిర్వహించారు. మండలంలోని లింగన్నపేట గ్రామంలో ముఖ్యంగా తాగునీటి సమస్య నెలకొందని, ఈగ్రామస్తులందరు ఒకే బోరు వద్ద నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారన్నారు. తాగు నీటి సమస్యను పరిష్కరించేందుకు మరో బోరు నిర్మించాలని ఎమ్మెల్యే వివేక్‌కు విన్న వించినా హామీ నెరవేరలేదన్నారు. గ్రామాల్లో పోడు పట్టాల్లో ఉన్న తప్పులను సవరించాలని, కాలనీలకు విద్యుత్ లైన్, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయకులు అశోక్, చిన్నన్న, భీమయ్య, రెడ్డి చిన్నన్న, సమ్మయ్య, తార పాల్గొన్నారు.

అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలి

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అన్ని పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధర ఇచ్చేలా చట్టం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు కాంతయ్య, అధ్యక్షుడు గోపినాథ్‌లు పేర్కొన్నారు. మంగళవారం చెన్నూరులోని మిర్చీ రైతులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మిర్చి దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని, వచ్చిన కొద్దిపాటి దిగుబడికి క్వింటాల్లకు రూ. 14 వేలు మాత్రమే ధర ఉందని, కనీస మిర్చీ మద్దతు ధర రూ. 25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

చెన్నూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చెన్నూరు 18వ వార్డు మాజీ కౌన్సిలర్ గర్రెపల్లి శాంతరాణి వెంకటనర్సయ్యలు మంగళవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. జిల్లాలోని గ్రామకంఠం భూములకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదని వారి అవసరం దృష్ట్యా ఇండ్ల నిర్మాణం కానీ, అమ్ముకోవడం కాని, బదలాయింపు చేయడానికి మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదిస్తే మున్సిపల్ కార్యాలయం ద్వారా ప్లింత్ ఏరియా సర్టిఫికెట్ కావాలని అడగడం, ఆ సర్టిఫికెట్ కోసం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు కేవలం భూమిలో ఉన్న నిర్మాణం ప్లింత్ ఏరియా సర్టిఫికెట్ ఇవ్వడం వల్ల మిగితా భూమి రికార్డుల్లో ఉండకుండా పోతోందన్నారు.

పరీక్షలంటే భయం వద్దు

నెన్నెల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఒత్తి డికి గురికాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని బెల్లం పల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ సూచించారు. చిత్తాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. శ్రద్ధగా చదివి పరీక్షల్లో రాయగలిగితే విజయం అందివస్తుందన్నారు. పెద్ద చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థానంలో నిలిచి కన్న తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురు వులకు మంచిపేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెన్నెల ఎస్సై ప్రసాద్, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:23 (బుధవారం సాయంత్రం)

సహర్: 5:04 (గురువారం ఉదయం)



జోడు వాగు వద్ద నిజాంలు నిర్మించిన వంతెన

కళ తప్పిన పర్యాటక కేంద్రం

- నాడు గలగల..నేడు వెలవెల
- జోడు వాగు ప్రాంతంపై కరువైన పట్టింపు
- పర్యవేక్షణ లేక ఆదరణ కోల్పోతున్న వైనం
- పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజల డిమాండ్

7

సేద తీరుతూ..గమ్యం చేరుతూ

మండుటెండలో... చలువ ప్రయాణం..!

ప్రధాన రహదారులకు ఇరువైపులా..

నీడనిస్తున్న వృక్షాలు..

మంచిర్యాల-ఆదిలాబాద్- నిర్మల్ ప్రధాన రహదారి మార్గంలో దండేపల్లి మండలంలోని తాళ్ల పేట మొదలు ముత్యంపేట వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వృక్షాలు ప్రయాణికులకు నీడ నిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై గమ్య స్థానాలకు చేరే వారు మధ్య మధ్యలో చెట్ల నీడన సేద తీరుతూ ప్రయాణిస్తున్నారు. నిత్యం వందలాది ప్రయాణికులు, వాహనదారులు ఈ చెట్ల నీడలో ప్రయాణం చేస్తున్నారు. - దండేపల్లి,ఆంధ్రజ్యోతి



వర్గీకరణలో అపోహలను తొలగించాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మార్చి18 (ఆంధ్ర జ్యోతి) : ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం నేపథ్యంలో మాల, మాదిగల మధ్య ఉన్న అపోహలను తొలగించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళ వారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అమలుచేసి తమ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేయడం మంచిదే అన్నారు. కానీ గతంలో మాలలపై జరిగిన దుష్ప్రచారం మంచిది కాదని తెలిపారు. రాష్ట్రంలో 65వేల ఉద్యోగాలను మాదిగలు పొందితే 45 వేలు మాలలు పొందారన్నారు. రాష్ట్రంలో మాల సామాజిక వర్గానికి సంబంధించిన నాయకులు దుష్ప్రచారంపై వాస్తవాలను వెల్లడించాలన్నారు. తమ సామాజిక వర్గంపై ఉన్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొడుతూ వాస్తవాలను వెల్లడించామన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

- పల్లెల్లో కంపుకొడుతున్న వీధులు
- రోడ్లపైనే మురుగునీరు
- పట్టించుకోని అధికారులు

6



భానుడి భగభగ



- 41డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- మధ్యాహ్నం సమయంలో మరింతగా ఎండ ప్రభావం
- ఉదయం పది గంటల నుంచే ఉక్కపోతలు
- సింగరేణి కార్మికులకు తప్పని తిప్పలు
- ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్న జనం

మంచిర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సూర్య ప్రతాపం కారణంగా ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎండలు రోజు రోజుకూ మండిపోతుండడంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మార్చి నెల లోనే సూర్యుడు తన ప్రతాపం చూపిస్తుండడంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా మేలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. అందుకు భిన్నంగా మార్చిలోనే 41 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే మేలో ఉష్ణోగ్రతలు ఏ స్థాయికి చేరుకుంటాయనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. వారంరోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వాతావరణశాఖ జిల్లాకు ఆరేంజ్ అలర్ట్ ప్రకటించింది. ప్రజలు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5దాటే వరకు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఎండ ప్రభావంతో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే మంచిర్యాల-లక్షెట్టిపేట జాతీయరహదారి, లక్ష్మీటాకీస్, బైపాస్‌రోడ్డు, ఫ్లైఓవర్ నుంచి శ్రీరాంపూర్‌వెళ్లే రహదారులు బోసిపోతున్నాయి. రాత్రి 7గంటల తరువాత ఉదయం 9గంటలకు ముందే ప్రజలు పనులు చేసుకుంటున్నారు.

తగ్గుముఖం పడుతున్న భూగర్భ జలాలు...

ఎండలు తీవ్రతరం కావడంతో భూగర్భజలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కారణంగా గోదావరి నదిలో పూర్తిగా నీరు అడుగంటి పోగా బోర్లలో సైతం ఆలస్యంగా నీరు వస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయం కారణంగా గోదావరి నిత్యం నిండుగాఉండి భూగర్భ జలాలకు డోకా ఉండేది కాదు. గ్రౌండ్ వాటర్ పుష్కలంగా ఉండి బోర్లలో సమృద్ధిగా నీరు లభించేది. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో రెండేళ్లుగా గోదావరిలో నీటిని నిల్వ చేయడం లేదు. దీంతో నది ఎండిపోవడమే కాక దాని ప్రభావం నది పరివాహక ప్రాంతాల్లోని బోర్లపైన పడుతోంది.

ఈ కారణంగా వ్యవసాయంపైన ప్రభావం చూపుతోంది. దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల్లో సుమారు 3వేల ఎకరాలకు యాసంగికి నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు కాలువల ద్వారా నీరు అందుతోంది. మిగితా ప్రాంతాల్లో రైతులు బోర్లపైనే ఆధారపడి సాగు చేస్తారు. ముఖ్యంగా గోదావరి పరివాహక ప్రాంతాల రైతులు నదిలో మోటార్లు ఏర్పాటు చేసుకొని పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం నది ఎండి పోవడంతో ఆ ప్రభావం యాసంగి సాగుపైన చూపుతోంది. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయే ప్రమాద ముందని రైతులు వాపోతున్నారు.

సింగరేణి కార్మికులకు తప్పని ఇబ్బందులు...

జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి ఏరియాలలోని ఓపెన్‌కాస్టు, అండర్ గ్రౌండ్ మైన్‌లలో విధులు నిర్వహించే కార్మికులు పెరిగిన ఎండల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మిడిల్ షిఫ్ట్, ఉదయం షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహించే కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం షిఫ్ట్ వెళ్లే కార్మికులు 2గంటలకు విధులు ముగించుకొని ఇంటికి రావాల్సి ఉండగా, మిడిల్ షిఫ్ట్ వెళ్లేవారు మధ్యాహ్నం ఒంటి గంటకు బయలు దేరాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విధులకు హాజరయ్యే వారు, విధుల నుంచి తిరిగి వచ్చే వారు ఎండ తీవ్రతకు గురవుతున్నారు. ఇప్పటికిప్పుడు గనుల్లో హాజరుశాతం తగ్గకపోయినా రాబోయే రోజుల్లో ఎండలు తీవ్రతరం కానుండగా...

మిగతా 7లో

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకటేశ్వర్‌రావు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : జిల్లాలో పన్నుల వసూళ్లు పూర్తయ్యాయా?

డీపీవో : జిల్లా వ్యాప్తంగా రూ. 6.82 కోట్ల పన్నుల వసూళ్ల లక్ష్యం ఉండగా ఇందులో 90 శాతం రూ. 6.30 కోట్లు వ సూలు చేశాం. వీటిని ఆయా గ్రామపంచాయతీలకు బదలాయించి అభివృద్ధి పనులకు వినియోగించేలా ప్రనాళికలు రూపొందించాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో తా గునీటి సమస్యలు ఉన్నాయి. అవి మీ దృష్టికి వ చ్చాయా. ఎలా పరిష్కరిస్తారు?

డీపీవో : జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం నీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాల్లో మళ్లీ నీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గు ర్తించి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తాం. జిల్లాలోని గ్రామాల్లో నీటి సమస్య లేకుండా తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్తాం.

ఆంధ్రజ్యోతి : పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పనితీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దానిపై మీ అభిప్రాయం?

డీపీవో : ప్రత్యేక అధికారుల పనితీరు సంతృప్తి కరంగా ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఎంపీవో, డీటీ, అగ్రికల్చర్, వెటర్నరీ తదితర అధికారులను జిల్లాలోని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. వేసవిలో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు అన్ని వనరులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టడం లేదని తెలుస్తోంది. గమనించారా.?

డీపీవో : జిల్లాలోని అన్ని గ్రామాల్లో ప్రతి రోజు పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. వాహనాలు మరమ్మతు కారణంగా ఒకటి రెండు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల్లో ఆలస్యం కావచ్చు అంతే. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను పర్య వేక్షిస్తూ పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేస్తున్నాం. అలాగే నర్సరీలను పరిశీలిస్తూ మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

-మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

ముగిసిన అంగన్‌వాడీల మహాధర్నా...

- సమస్యలపై వినతి పత్రం అందజేత..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

నస్పూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్- హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో 48గంటల మహాధర్నా మంగళవారం ముగిసింది. శిబిరంలోనే బతుకమ్మ, తెలంగాణ దూంధాం ఆటపాటలతో నృత్యాలు చేశారు. మంగళవారం మధ్యాహ్నం వంటా వార్పుతో నిరసన తెలియజేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించాలని కార్యాలయంలో అధికారి సంతోష్‌కు వినతి పత్రం అం దించారు. అంగన్‌వాడీ టీచర్స్-హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి భానుమతి, రాజమణి మాట్లాడుతూ ప్రతినెల ఒకటవ తేదిన వేతనాలు చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేయవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెర్కొన్న ప్రకారం రూ. 26వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌ను నిర్వీ ర్యంచేసే పీఎం శ్రీ పథకం, మొబైల్ అంగన్ వాడీ సెంటర్లను రద్దు చేయాలని, టీచర్స్ హెల్పర్స్‌లకు గ్రాట్యుటీ వర్తింపు పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, అంగన్‌వాడీ జిల్లా కమిటీ సభ్యులు పద్మా, విరోనిక, సంధ్యా, విక్టోరియా, పద్మ, సబితా, ప్రవీణ, అనురాధా, మహేశ్వరి పాల్గొన్నారు.

మైండ్స్ ఆఫ్-2025లో ప్రధానోపాధ్యాయుడికి చోటు



పర్వతి సత్యనారాయణ

మంచిర్యాల, మార్చి 18(ఆంధ్ర జ్యోతి): ఇండియా టుడే మ్యాగజైన్ సోమవారం ప్రచురించిన మైండ్స్ ఆఫ్ -2025లో మంచిర్యాలకు చెందిన గెజిటెడ్ ప్రధానో పాధ్యాయులు డాక్టర్ పర్వతి సత్యనా రాయణకు చోటు లభించింది. టాప్-10 జాబితాలో చోటు సంపాదించిన పర్వతి సత్యనారాయణ గెజిటెడ్ ప్రధానోపాధ్యా యుడిగా మెదక్ జిల్లా తుప్రాన్‌లో పని చేస్తుండగా మండలవిద్యాశాఖ అధికారి గా కూడ కొనసాగుతున్నారు.

దూర దృష్టి కలిగిన విద్యాసంస్కర్తగా, ఆదర్శవంత మైన విద్యావేత్తగా, పీఆర్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ కొన సాగుతున్నారు. తనచుట్టూ ఉన్న ఉపాధ్యాయుల్లో నిత్యం స్ఫూర్తి నింపుతూ అనేకమంది విద్యార్థులకు, తోటి ఉపాధ్యా యులకు మార్గదర్శిగా ఉంటూనే విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తున్న ఆయనకు చోటు లభించడం పట్ల సహ చర ఉపాధ్యాయులు, విద్యా వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు నేస్తం కార్యక్రమం

జన్నారం, మార్చి 18 (ఆంధ్ర జ్యోతి) : జన్నారంలోని రైతు వేదికలో మంగళ వారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాస్త్ర వేత్త డాక్టర్ హరికాంత్ మామిడి తోటలో యాజమాన్య పద్ధతుల గురించి వివరిం చగా, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్ వేసవిలో దుక్కి దున్నడంవల్ల కలిగే ప్రయో జనాల గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవ సాయా ధికారి కల్పన, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మండల వ్యవసా యాధికారి సంగీత, ఏఈవోలు త్రిసంధ్య, దివ్య, సాయి, లవణ్, అక్రమ్, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు మోక్షం లభిస్తుందా...?

- గోదావరి వంతెన నిర్మాణానికి హామీ
- ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తారా..?
- హామీల అమలు కోసం ప్రజల ఎదురు చూపు
- నేడు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి



మంచిర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత అసెంబ్లీలో రెండో దఫా బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ ప్రకటించిన విధంగా మరి కొన్ని పథకాలు అమలు చేయాల్సి ఉంది. ముఖ్యంగా జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల కేటాయించాల్సి ఉంది. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే ఇక్కడి పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇక్కడి విద్యార్థులు హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఉన్నత విద్యను స్థానికంగానే అభ్యసించే వెసులుబాటు కలుగుతుంది. ఈ బడ్జెట్‌లో కళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలనే డిమాండ్లు సర్వత్రా ఉన్నాయి.

- ఎల్లంపల్లి ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం చెల్లించాల్సి ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు నెలల్లోపు పరిహారం చెల్లిస్తామనే హామీ ఉంది.

గోదావరి వంతెనకు మోక్షం కలుగుతుందా...?

గోదావరి నదిపై హై లెవల్ వంతెన నిర్మాణం చేపడతామని స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పలుమార్లు ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నదిపై వంతెన నిర్మాణానికి అనుమతులు ఇవ్వగా, బడ్జెట్ కేటా యింపులు కూడా జరిగాయి. పనులు ప్రారంభించే దశలో ఆగి పోయింది. వంతెన పూర్తయితే మంచిర్యాల నుంచి అంతర్గాం మీదుగా బసంత్‌నగర్ వరకు నేరుగా రాకపోకలకు వెసులుబాటు కలుగుతుంది. వంతెన నిర్మాణం కోసం కేటాయించిన స్థలం అనువుగా లేదని, ముల్కల్ల వద్ద నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించి, త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలనే డిమాండ్లు ఉన్నాయి.

రైల్వే ట్రాక్‌పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేనా...?

జిల్లా కేంద్రంలోని లక్ష్మీటాకీస్ చౌరస్తా నుంచి రైల్వే ట్రాక్ మీదుగా శ్రీశ్రీ నగర్‌కు వెళ్లేందుకు ప్రత్యేకంగాపై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టవలసి ఉంది. బ్రిడ్జి నిర్మాణం జరిగితే బైపాస్ రింగు రోడ్డు పూర్తయి నగరంలో ట్రాఫిక్ సమస్య తొలగిపో నుంది. లక్ష్మీటాకీస్ చౌరస్తా నుంచి ట్రాక్ మీదుగా నేరుగా మంచిర్యాల-శ్రీరాంపూర్ హైవేకు రాకపోకలు సులువుగా జరుగుతాయి.

ప్రాణహిత చేవేళ్ల కార్యరూపం దాల్చుతుందా...?

ఆసిఫాబాద్ జిల్లా తుమ్మడిహేటి వద్ద ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టును పునర్నిర్మిస్తామని 2023 నవంబర్ 11న పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బెల్లంపల్లిలో నిర్వహించిన విజయభేరి సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్ రా జశేఖర్ రెడ్డి హయాంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్ష 60 వేల ఎకరాలకు సాగు నీరు అందించే ఉద్దేశ్యంతో ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. ప్రాజెక్టు పూర్తయితే నీరు అందేఅవకాశం ఉండేదన్నారు. ఇదే విషయమై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రెండు రోజుల క్రితం ప్రస్తావించారు. సాంకేతిక పరమైన అంశాలపై మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి వచ్చే వేసవిలో ప్రాజెక్టు పనులు పునః ప్రారంభించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి బడ్జెట్ కేటాయించాలనే డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి.

ఒత్తిడిని జయిస్తేనే విజేతలవుతారు

అదనపు కలెక్టర్ మోతిలాల్

కాసిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతి పరీక్షలురాసే విద్యార్థులు ఒత్తిడి ని జయిస్తేనే విజేతలుగా నిలుస్తారని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. మంగళ వారం మండలంలోని దేవాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పదవతరగతి విద్యార్థినులతో ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని పరీక్షలంటే భయం వీడాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం దేవాపూర్‌లోని నర్సరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పురు షోత్తం నాయక్, ఎంపీడీవో సత్యనారాయ ణసింగ్, ప్రధానోపా ధ్యాయుడు రొడ్డగోపాల్, పంచాయతీ కార్యదర్శి కవిత పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు సహకరించాలి

మండలంలో కొనసాగుతున్న అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరు సహకరించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన నిరక్షరాస్యులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 31తో నిర్దేశించుకున్న గడువు ముగిసిపోనుందని , వంద రోజుల అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరు భాగస్వాములు కావాలన్నారు. లీడ్ బ్యాంకు అధికారి తిరుపతి, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్, డీఆర్‌పీలు బండ శాంకరి పాల్గొన్నారు.



దేవాపూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్